Vaartha (Telugu)


హైదరాబాద్ వార్త



బుధవారం 9, నవంబర్ 2005 — 20 పేజీలు


# ఓజోన్‌కు ఎంత నష్టం?

ప్రభాతవార్త, సిటీబ్యూరో హైదరాబాద్, నవంబర్ 8

ఓజోన్ పొరకు కలిగే నష్టాన్ని తెలుసుకునేందుకు జర్మనీ నుంచి ఆస్ట్రేలియా దాకా (భారతదేశం మీదుగా) ప్రత్యేక ఎయిర్‌క్రాఫ్ట్‌నుతిప్పుతున్నట్లు స్కాట్-03 ప్రాజెక్టు హెడ్ డాక్టర్ సి. షిల్లర్ తెలిపారు. మంగళవారం బీఎం బిర్లా సైన్స్ ప్లానెటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. కాలుష్యం వల్ల ఓజోన్ పొరకు తీవ్ర నష్టం వాటిల్లడమే గాక వాతావరణంలో పలుమార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. క్లోరో ఫ్లోరో కార్బన్ల మూలంగా ఓజోన్ పొర దెబ్బతింటున్నదని, ఫలితంగా ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే పదేళ్ళలో ఓజోన్ మరింతగా దెబ్బతింటుందన్నారు. 1999 సంవత్సరంలో మొదటి సారిగా అంటార్కిటికాలో ఎయిర్‌క్రాఫ్ట్ సర్వే నిర్వహించారని, భారతదేశంలో తొలిసారిగా చేపడుతున్నామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఇద్దరు శాస్త్రవేత్తలు ఉంటారని, కమర్షల్ విమానాలు పది నుంచి 12 కిలోమీటర్ల ఎత్తు వరకే వెళతాయని, ఈ విమానం ఓజోన్ పొర సమీపంలోకి వెళ్తుందన్నారు. స్కాట్-03 ప్రాజెక్టుకు ఇండియా, ఇండోనేషియా దేశాలు మద్దతు పలుకుతున్నాయని, యురోపియన్ యూనియన్ ఆర్థిక సహాయం చేస్తున్నదని షిల్లర్ తెలిపారు. ఓజోన్ పొరపై పరిశోధన జరుపుతున్న విద్యార్థులు బుధవారం బిర్లా సైన్స్ ప్లానెటోరియానికి వస్తున్నారని ముంబైలోని నేషనల్ బెలూన్ ఫెసిలిటీ శాస్త్రవేత్త ఆర్‌కె. మచింద తెలిపారు. ఈ సమావేశంలో బీఎం బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్‌జనరల్ సిద్ధార్థ పాల్గొన్నారు.